1950
Dec 14

# జనార్దన్ రెడ్డి మరియు ఇతరులు

*వెర్సెస్*

# ప్రభుత్వము

(గౌరవ ప్రధాన న్యాయమూర్తి శ్రీ హరిలాల్ కనియా మరియు గౌరవ న్యాయమూర్తులు సర్వశ్రీ సయ్యద్ ఫజల్ అలీ, పతంజలి శాస్త్రి, ముఖర్జీయ, దాస్ మరియు చంద్రశేఖర అయ్యర్)

*భారత రాజ్యాంగం, ఆర్టికల్ 134, 136, 374(4) లు – అప్పీలు చేయుటకు ప్రత్యేక అనుమతి – తేదీ 26 జనవరి 1950 కు ముందు హైదరాబాద్ హైకోర్టు వెలువరించిన తీర్పు – ప్రత్యేక అనుమతికై దరఖాస్తు – నిర్వహింపబడుట – నూతన రాజ్యాంగము అమలులోనికి వచ్చినప్పటికి హైదరాబాద్ జ్యుడీషియల్ కమిటీ ముందు అప్పీల్ చేసుకొనుటకు అనుమతి కొరకైన అనిర్ణీత స్థితిలో ఉన్న దరఖాస్తు, ప్రభావం – ఆర్టికల్ 136 యొక్క పరిధి – భారత భూభాగ పరిధిలో ఉన్న ఏదైన కోర్టు లేదా ట్రిబునల్ "– చట్టముల యొక్క అర్థ వివరణ – భవిష్యత్ వర్తన యొక్క పురోభావన – అప్పీలు చేసుకొనుటకు గల హక్కు .*

హైదరాబాద్ రాష్ట్రములోని ఒక ప్రత్యేక ట్రిబునల్ చే శిక్షార్హులుగా నిర్ణయించబడి మరియు మరణశిక్షకు గురికాబడిన దరఖాస్తుదారులు దాఖలు చేసుకున్న అప్పీళ్లను హైదరాబాద్ హైకోర్టు త్రోసిపుచ్చినది మరియు హైకోర్టు ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకముగా అప్పీలు చేసుకొనుటకు అనుమతి కొరకై వారు తేదీ 21.01.1950 న హైదరాబాద్ జ్యుడీషియల్ కమిటీ కు దరఖాస్తు చేసుకొనినారు. తేదీ 26.01.1950 న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి నది మరియు

రాజ్యాంగం క్రింద హైదరాబాద్ భారతదేశములో అంతర్భాగము కావడమూ , హైదరాబాద్ జ్యుడీషియల్ కమిటీ ఉనికి లుప్తము కావడమూ, మరియు ఆ కమిటీ ముందు అనిర్ణీత స్థితి లో ఉన్న అన్ని అప్పీళ్లు మరియు ఇతర ప్రొసీడింగ్‌లు భారత సర్వోన్నత న్యాయస్థానానికి బదిలీ కావడమూ జరిగినది. దరఖాస్తుదారుల యొక్క అర్జీలను రాజ్యాంగములోని ఆర్టికల్ 134 క్రిందికి వచ్చినట్లుగా సవరణ చేయడము జరిగినది , కానీ ఆర్టికల్ 134 క్రిందికి అటువంటి దరఖాస్తులు రావన్న కారణముతోనూ మరియు (వాని) యోగ్యతల ఆధారముగాను, అవి త్రోసిపుచ్చబడినది. దాని మీదట దరఖాస్తుదారులు అప్పీలు చేసుకోవడానికి ప్రత్యేక అనుమతి కొరకు రాజ్యాంగములోని ఆర్టికల్ 136 క్రింద భారత సర్వోన్నత న్యాయస్థానం ముందు ఒక దరఖాస్తును దాఖలు చేసుకొనడమైనది:

తీర్పు:

" భారత భూభాగ పరిధిలోని ఏదైన కోర్టు లేక ట్రిబునల్" వెలువరించిన ఏవైన తీర్పులు, డిక్రీలు, శిక్ష విధింపులు లేక ఇచ్చిన ఉత్తర్వులపై మాత్రమే అప్పీలు చేయడానికి ప్రత్యేక అనుమతిని ఇచ్చే అధికారాన్ని సుప్రీం కోర్టునకు ఆర్టికల్ 136 కల్పిస్తున్నది , మరియు ప్రస్తుత వివాదాస్పద తీర్పు ఇచ్చిన నాటికి హైదరాబాద్ హైకోర్టు భారత భూభాగ పరిధిలో లేనందున , ప్రత్యేక అనుమతిని ఇవ్వడానికి సుప్రీం కోర్టునకు న్యాయనిర్ణయాధికారం లేదు.

కేవలం రాజ్యాంగము అమలులోనికి వచ్చిన నాటికి దరఖాస్తుదారులకు హైదరాబాద్ జుడీషియల్ కమిటీకి అప్పీలు చేసుకునే అధికారం ఉన్నందువలన మరియు ప్రత్యామ్నాయము ఏర్పరచకుండానూ మరియు సుప్రీం కోర్టునకు వారు అప్పీలు దరఖాస్తు చేసుకొనుటకు వీలు

కలిగించే నిబంధనను పొందుపర్చకుండానూ, ఆ కమిటీ రద్దు కాబడినందున వారు ఆ హక్కును కోల్పోవడము జరిగినందున , హైదరాబాద్ భారతదేశములో అంతర్భాగము కాకముందు వెలువరించబడిన తీర్పులకు లేదా ఉత్తర్వులకు ఆర్టికల్ 136 వర్తించగలదని మరియు అప్పీలు చేసుకునే హక్కును ప్రధానం చేయగలదని నిష్కర్ష చేయజాలము.

## అప్పిలేట్ న్యాయనిర్ణయాధికార పరిధి (క్రిమినల్): క్రిమినల్ సకలవిధ (Miscellaneous) దరఖాస్తులు నెం.లు. 71 నుండి 73/ 1950.

దరఖాస్తుదారులను హత్యానేరమునకు శిక్షార్హులుగా నిర్ణయిస్తూ మరియు వారికి మరణశిక్ష విధిస్తూ హైదరాబాద్ స్పెషల్ ట్రిబ్యునల్ వెలువరించిన ఉత్తర్వులపై వారు వేసుకున్న అప్పీళ్లను త్రోసిపుచ్చుతూ 1949 సం . డిసెంబర్ 12 , 13 మరియు 14వ తేదీలలో హైదరాబాద్ హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకు అప్పీల్ దాఖలు చేసుకొనుటకు ప్రత్యేక అనుమతి కోరుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 క్రింద దాఖలు చేయబడిన దరఖాస్తులు.

దరఖాస్తుదారుల తరపున: డి. ఎన్ ప్రిట్ (కే.బి. అస్థానా, డేనియల్ లతీఫీ, భావా శివ చరణ్ సింగ్ మరియు ఏ.ఎస్.ఆర్ చారి)

ప్రతివాది తరపున: భారత అటార్నీజనరల్ అయిన ఎం.సి. సెతల్వాద్ మరియు రాజా రామ్ అయ్యర్ (వారితో పాటు జి.ఎన్.జోషి)

తేదీ 14.12.1950న గౌరవ ప్రధాన న్యాయమూర్తి కనియా గారిచే వెలువరించబడిన ఈ కోర్టు యొక్క **తీర్పు**: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 క్రింద సుప్రీంకోర్టునకు అప్పీలు చేసుకొనడానికి ప్రత్యేక అనుమతిని కోరుతూ దాఖలైన మూడు క్రిమినల్ సకలవిధ దరఖాస్తులు ఇవి.

నిందితులు అందరూ కమ్యూనిస్టు పార్టీ సభ్యులై ఉండి , హైదరాబాద్‌లో ఉనికిలో ఉన్న ప్రభుత్వాన్ని హింసాత్మకంగా కూలదోసి, దాని స్థానంలో కమ్యూనిస్టు పరిపాలనను స్థాపించాలన్న విధానానికి కట్టుబడి ఉన్నారని ఆరోపింపబడినారు. వారు , వారియొక్క కమ్యూనిస్టు వ్యవస్థ కొరకై విరాళములను డిమాండ్ చేసినారనియు మరియు వారి డిమాండ్లను నెరవేర్చని కొంతమంది గ్రామస్తులు తేదీ 21.09.1948న అపహరింపబడి హత్యగావింపబడినారనియు ఆరోపింపబడినది. **H.E. H నిజాం** అధికారం క్రింద సైనిక గవర్నర్ గారిచే జారీచేయబడిన నిబంధనల క్రింద ఏర్పరచబడిన ప్రత్యేక ట్రిబ్యునల్ ముందు వారిపై హత్యానేరముతోపాటు అనేక ఇతర నేరముల ఆరోపణలు చేయబడి, 1949 సం. ఆగష్టు 9, 13 మరియు 14వ తేదీలలో వెలువరింపబడిన వేర్వేరు తీర్పుల ద్వారా వారు శిక్షార్హులుగా నిర్ణయింపబడినారు మరియు (వారికి) మరణ శిక్ష విధించడమైనది. దరఖాస్తుదారులు ఈ తీర్పులపై హైదరాబాద్ హైకోర్టునకు అప్పీలు చేసుకున్నారు మరియు 1949 డిసెంబర్ నెల 12, 13 మరియు 14వ తేదీలలో వెలువరింపబడిన తీర్పుల ద్వారా హైకోర్టు క్రమానుగతముగ ఈ అప్పీళ్లను త్రోసిపుచ్చినది. హైదరాబాద్ రాష్ట్ర జ్యుడీషియల్ కమిటీకి అప్పీల్ చేసుకొనుట కొరకు ధృవపత్రాన్ని కోరుతూ , తేదీ 21.01.1950 న దరఖాస్తుదారులు హైకోర్టున కు దరఖాస్తు చేసుకొన్నారు. ప్రతిపాదించబడిన భారత రాజ్యాంగము హైదరాబాద్ ప్రభుత్వమునకు అనుకూలముగానే ఉన్నదని తెలుపుతూ , మరియు దీనిని మొదటి షెడ్యూల్ లోని బి–విభాగములో ఉన్న రాష్ట్రాలలో ఒకటిగా ఉన్న హైదరాబాద్ రాష్ట్రము యొక్క రాజ్యాంగముగానే తాను అంగీకరిస్తున్నట్లుగా , తేదీ 23.11.1949న **H.E.H నిజాం** ఒక ఫర్మానాను జారీ చేసినట్లుగా తెలుస్తున్నది. తేదీ 26.01.1950న భారత రాజ్యాంగం భారత సమాఖ్యకు మరియు బి–విభాగములోని రాష్ట్రాలకు కూడా వర్తింపచేయబడినది. మొదటగా , హైదరాబాద్ రాష్ట్ర ప్రివీ కౌన్సిల్ యొక్క జ్యుడీషియల్ కమిటీ ముందు అప్పీల్ చే యుటకై అనుమతి ధృవపత్రము కొరకు దాఖలు చేయబడిన దరఖాస్తులు , కోర్టు అనుమతి తో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 134 క్రింద దాఖలు

చేయబడిన దరఖాస్తులుగా సవరింపచేయబడినవి. ఈ దరఖాస్తులు ఆర్టికల్ 134 కింద నిర్వహింపబడజాలవనియూ మరియు దరఖాస్తుదారులు అడిగిన ధృవపత్రము ఇచ్చుటకు యోగ్యతల ఆధారముగా కేసు రుజువు కాలేదనియూ ప్రకటిస్తూ, హైదరాబాద్ హైకోర్టు యొక్క డివిజన్ బెంచ్ ఈ దరఖాస్తులను త్రోసిపుచ్చడమైనది. ప్రస్తుతము 1949 డిసెంబరు నెల 12, 13 మరియు 14 తేదీల నాటి హైకోర్టు ఇచ్చిన తీర్పుల నుండి అప్పీల్ దాఖలు చేయడము కొరకు ప్రత్యేక అనుమతి కోరుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 క్రింద దరఖాస్తుదారులు ఈ కోర్టు ముందు వారి దరఖాస్తులను దాఖలు చేసుకున్నారు.

పరిశీలనకు రెండు ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. మొదటిది, ఈ కేసు యొక్క పరిస్థితులలో ఆర్టికల్ 136 కింద సుప్రీంకోర్టు నకు దరఖాస్తును చేయవచ్చునా, మరియు రెండవది, ఒకవేళ దానికి (సుప్రీంకోర్టునకు) దరఖాస్తును పరిగణింపగల న్యాయ నిర్ణయ అధికార పరిధి ఉన్నట్లైతే, ఈ కేసు వాస్తవాలను బట్టి కోర్టు ప్రత్యేక అనుమతిని ఇవ్వవలయునా. మొదటి ప్రశ్న భారత రాజ్యాంగంలోని సంబంధిత ఆర్టికల్ ల యొక్క నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది. ఆర్టికల్ 374(4) ప్రకారం, ఈ రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పటి నుండి మొదటి షెడ్యూల్డ్ లోని బి – విభాగములో పేర్కొనబడిన రాష్ట్రంలోని ప్రివీ కౌన్సిల్ నకు, ఆ రాష్ట్రములోని ఏ కోర్టు అయిన ఇచ్చిన తీర్పు, డిక్రీ లేదా ఉత్తర్వులకు సంబంధించిన అప్పీళ్ళు మరియు దరఖాస్తులను పరిగణించి పరిష్కరించే అధికారం లుప్తం అవుతుంది మరియు ఆ అమలు సమయానికి ఆ సంస్థ ముందు అనిర్ణీతముగా యుండియున్న అప్పీళ్ళు మరియు ఇతర ప్రొసీడింగ్ లు సుప్రీంకోర్టు నకు బదిలీ చేయబడి, దాని(సుప్రీంకోర్టు)చే పరిష్కరింపబడవలయును. అందువలన ఈ ఉప నిబంధన (సబ్ క్లాజు) హైదరాబాద్ రాష్ట్ర ప్రివీ కౌన్సిల్ యొక్క న్యాయ నిర్ణయ అధికార పరిధిని రద్దు పరుస్తున్నది మరియు భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత, ఈ సంస్థ మరియు దీని న్యాయ నిర్ణయ అధికార పరిధి పూర్తిగా ఉనికి కోల్పోయినవి.

మా ముందున్న వాస్తవాల ను బట్టి, హైదరాబాద్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పులకు సంబంధించి , హైదరాబాద్ ప్రివీ కౌన్సిల్ రద్దు చేయబడడానికి పూర్వము దాని ముందు ఏ విధమైన అప్పీళ్ళు అనిర్ణీతముగా ఉండి ఉండనందున , ఈ ఉప నిబంధన అమలు వలన అటువంటిది ఏదీ కూడా సుప్రీంకోర్టుకు బదిలీ కాబడి ఉండలేదని స్పష్టంమవుతున్నది.

తేదీ 25.01.1950 నాటికి హైదరాబాద్ రాష్ట్రము యొక్క ప్రివీ కౌన్సిల్‌కు అప్పీల్ చేసుకొనడానికి అనుమతిని ఇచ్చే ధృవపత్రం కొరకై, హైదరాబాద్ హైకోర్టును ఆశ్రయించే హక్కు దరఖాస్తుదారులు కలిగి ఉన్నారని, వారి తరపున వాదనలను వినిపించడమైనది. నిజానికి, ఆనాటికి అటువంటి దరఖాస్తులు అనిర్ణీతముగా ఉండి ఉన్నాయి. అందువలన , కేవలము హైదరాబాద్ రాష్ట్రానికి భారత రాజ్యాంగము వర్తించడం వలన తేదీ 25.01.1950 నాటికి ఉనికిలో ఉన్న అప్పీలు హక్కు అంతర్నిహితముగా(impliedly) తీసివేయబడజాలదని వాదించినారు. ఒకవేళ ఆర్టికల్ 136 సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకునే హక్కును కలుగ చేస్తున్నట్లుగా అన్వయించకపోయినట్లైతే , అప్పీలు హక్కు కలిగిన లేదా ధృవపత్రమున కొరకు దరఖాస్తు చేయడానికి సమయము కలిగిన , శిక్షార్హులుగా నిర్ణయింపబడిన వ్యక్తులందరూ , మరియు అటువంటి ధృవపత్రము కొరకు హైదరాబాద్ హైకోర్టు ముందు చేసుకున్న దరఖాస్తు చేసుకుని , పని వత్తిడి కారణంగా ఆ కోర్టు పరిష్కారం చేయని దరఖాస్తులు కలిగిన వ్యక్తులూ కూడా ఉన్నత న్యాయస్థానానికి అప్పీల్ చే సుకునే హక్కును కోల్పోవడమవుతుందని, ఎత్తి చూపడము జరిగినది. ఒకవేళ ఆర్టికల్ 136 నకు విస్తృతమైన అన్వయము ఇచ్చినట్లైతే, ఆర్టికల్ 136 క్రింద అనుమతి కొరకు దరఖాస్తు చేయుటకు కష్టం ఉందని చెప్పబడుతున్న వ్యక్తులకు అనుమతి ఇవ్వడమే కాకుండా, అనేక ఇతర హక్కులను కూడా సృష్టించడం జరుగుతుందని , ప్రభుత్వం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఎత్తి చూపినారు. అటువంటి హక్కులు క్రిమినల్ కేసుల లో మాత్రమే కాకుండా సివిల్ కేసులలో కూడా ఉత్పన్నమవుతాయి మరియు అవి దరఖాస్తు చేయుటకు గల కాల పరిమితికి సంబంధం

లేకుడా వినియోగింపబడుతాయి, దాని ఫలితంగా పాత తీర్పు లు కూడా ప్రశ్నింపబడే అవకాశం ఉన్నది. అదీ కాకుండా, ఆర్టికల్ 136 యొక్క విస్తృత అన్వయం వలన, హైకోర్టు ల యొక్క తీర్పుల నుండి అప్పీలు చేయబడగలిగిన ప్రివీ కౌన్సిల్ వంటి న్యాయస్థానాలు ఏవీ ఉనికిలో లేకపోవడం వలన, అట్టి తీర్పులు తుది తీర్పులుగా అయిన రాష్ట్రాలలోని తీర్పులు కూడా , వాని నుండి పూర్వము అప్పీలు చేయబడజాలకపోయినా, అప్పీలునకు తేబడే అవకాశం ఉంటుంది. అందువలన , వెసులుబాటు యొక్క సమతులన ఏదయినా ఉంటే , అది దరఖాస్తుదారుల యొక్క వాదనకు వ్యతిరేకముగా ఉన్నదని వాదించడం జరిగినది. (ప్రస్తుత) ప్రశ్న పరిగణనయే సక్రమము కాదని గట్టిగా వాదించడము జరిగినది. రాజ్యాంగంలోని ఆర్టికల్ లు వాని యొక్క సహజమైన సాదా అర్ధముల ప్రకారమే అన్వయింపబడాలి మరియు వాని యొక్క సహజమైన నిర్మాణంపై కష్టాల గురించిన కేసులు ప్రభావము చూపే విధముగా చేయరాదు. కష్టాలకేసులు లోపభూయిష్టచట్టాల తయారీని చేయడానికి అంగీకరించరాదు. మా అభిప్రాయం ప్రకారం , అటార్నీ జనరల్ గారి యొక్క ఈ వాదన సరైన దే. రాజ్యాంగంలో ఉపయోగింపబడిన పదముల యొక్క నిజమైన అర్ధాన్ని కష్టము అనే ప్రశ్న ప్రభావితం చేయ డము సమ్మతం కాదు మరియు అనుమతింపబడకూడదు. అందువలన, కష్టమును గురించిన పరిగణనలకు సంబంధము లేకుండా, ఈ ఆర్టికల్ లను పరిశీలించడమే సరైనది అవుతుంది.

ఈ కేసు యొక్క వాస్తవాల ను బట్టి , ప్రత్యేక అనుమతిని ఇవ్వడానికి సుప్రీంకోర్టునకు న్యాయ నిర్ణయాధికార పరిధి ఉన్నదా అని నిర్ణయించడానికి, భారత రాజ్యాంగంలోని 133, 134, 135 మరియు 136 ఆర్టికల్‌లను పరిశీలించడము అవసరమైయున్నది. ఆర్టికల్ 133 యొక్క సారాంశం ప్రకారం , సివిల్ కేసులలో హైకోర్టుల నుండి ప్రివీ కౌన్సిల్ నకు అప్పీల్ చేయడానికి సంబంధించిన సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని పాత నిబంధనలను (ఇది) నిలిపి ఉంచినది . ఆర్టికల్ 134 ప్రకారం, భారత దేశ భూభాగ పరిధిలో ఉన్న హైకోర్టు ఒక క్రిమినల్ ప్రొసీడింగ్‌లో ఇచ్చిన తీర్పు, తుది ఉత్తర్వు లేదా శిక్ష నుండి,

ఒకవేళ హైకోర్టు...... (అటువంటి అప్పీళ్లు చేయదగిన మూడు యాదృచ్ఛికతలు ఉన్నప్పుడు) సుప్రీం కోర్టునకు అప్పీల్ ను నిబంధిస్తున్నది . ఆర్టికల్ 133 లో కూడా "భారతదేశ భూభాగ పరిధి లో" అన్న పదములు వినియోగింపబడినవి. ఆర్టికల్ 133 లేదా 134 లోని అంశములు వర్తించని కేసుల కోసం ఆర్టికల్ 135 ఉన్నది. అందువలన ఈ రాజ్యాంగము అమలులోనికి వచ్చుటకు ముందు సమీప కాలములో ఉనికిలో ఉన్న చట్టము ప్రకారము ఫెడరల్ కోర్టు తన న్యాయనిర్ణయ ఆధికార పరిధిని , అధికారాలను వినియోగించగలిగిన ఏ కేసుకు అయినా ఆర్టికల్ 133 మరియు 134 లోని నిబంధనలు వర్తించనప్పుడు, పార్లమెంట్ చట్టము ద్వారా ఇతర విధమైన నిబంధనలు తేనంత వరకు , దానిపై సుప్రీం కోర్టు న్యాయ నిర్ణయ ఆధికార పరిధి మరియు ఆధికారములను కలిగి ఉన్నదని , ఇది (ఆర్టికల్ 135) నిబంధిస్తున్నది. పూర్వము ఉనికిలో ఉన్న చట్టముల క్రింద హై కోర్టు నుండి వచ్చిన అప్పీళ్లపై ఫెడరల్ కోర్టుకు న్యాయ నిర్ణయ అధికార పరిధి ఉన్న కేసులు , ఆర్టికల్ 133 మరియు 134 ల పరిధిలోనికి రానప్పుడు , వాని పై సుప్రీం కోర్టు యొక్క న్యాయ నిర్ణయ అధికార పరిధిని వినియోగించుకునేందుకు వీలు కలుగజేయుటకై , ఈ ఆర్టికల్ ను రాజ్యాంగంలో చేర్చడం జరిగినది. గతంలో ఉన్న **ప్రివీ కౌన్సిల్ న్యాయ నిర్ణయ అధికార పరిధి రద్దు చట్టము, 1949** ప్రకారం, ఫెడరల్ కోర్టు కలిగి యుండిన న్యాయ నిర్ణయ అధికార పరిధిని , సుప్రీం కోర్టు నకు ఈ నిబంధన కలుగజేస్తున్నదనేది సుస్పష్టమవుతుంది. తేదీ 10.10.1949 కి ముందు హైకోర్టు నుంచి వచ్చి అనిర్ణయముగా ఉన్న అప్పీళ్లు తప్ప మిగిలిన వానిని పరిశీలించడానికి ప్రివీ కౌన్సిల్ నకు గల న్యాయనిర్ణయాధికార పరిధి ఈ చట్టంచే తీసివేయబడినదన్న విషయము ఇక్కడ చెప్పవలసి ఉన్నది. అందువలన ఇప్పటికి అనిర్ణీతముగా ఉన్నవీ లేదా ఆర్టికల్ 133 మరియు 134 అంశముల పరిధిలోనికి రానివీ అయిన అప్పీళ్లను గురించి నిబంధనను చేయవలసి యున్నది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 ఈ క్రింది విధముగా ఉన్నది:

*"136. (1) ఈ అధ్యాయములో ఏమి యున్నప్పటికి నీ, భారతదేశ రాజ్య క్షేత్రములోని ఏ న్యాయస్థానముచేనైనను, లేక ఏ ట్రిబ్యునలు చేనైనను ఏదేని వ్యాజ్యములో, లేక విషయములో ఇవ్వబడిన ఏదేని తీర్పు, డిక్రీ, నిర్ధారణ, దండనోత్తరువు లేక ఉత్తరువుపై అప్పీలు చేసుకొనుటకు సర్వోన్నత న్యాయస్థానము తన వివేచనానుసారము విశేష అనుజ్ఞ ఇవ్వవచ్చును.*

*(2)........."*

*"భారత దేశ భూభాగ" అనే వ్యక్తీకరణ ఆర్టికల్ 1లో ఈ విధముగా నిర్వచింపబడినది.*

*"1. భారతదేశ భూభాగంలో (ఈ క్రింద చెప్పబడినవి) ఇమిడి ఉన్నవి.*

*(ఎ) రాష్ట్రాల యొక్క భూభాగములు (అంటే మొదటి షెడ్యూల్‌లోని ఎ, బి మరియు సి విభాగములలో పేర్కొనబడిన రాష్ట్రములు)*

*(బి) మొదటి షెడ్యూల్‌లోని D–విభాగములో పేర్కొనబడిన భూ భాగములు, (అంటే, అండమాన్ మరియు నికోబార్ దీవులు) మరియు*

*(సి) (ముందు ముందు) పొందబడే భూ భాగములు.*

ప్రస్తుత కేసు యొక్క వాస్తవాలను బట్టి, సం. 1950 జనవరి నెల, 26 తేదీ కి ముందు హైదరాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు, శిక్షా లేదా ఉత్తర్వు నుండి అప్పీలు చేయడానికి సుప్రీం కోర్టు ప్రత్యేక అనుమతిని ఇవ్వగలదా అన్నది ప్రస్తుతము పరిశీలనలో ఉన్న ప్రశ్న. 1949 డిసెంబర్ నెల 12, 13 మరియు 14 వ తేదీలలో హైదరాబాద్ కోర్టులు తీర్పులు ఇచ్చినప్పుడు అవి భారతదేశ భూభాగ పరిధిలో లేవన్న విషయం ముఖ్యముగా గమనికలో ఉంచుకోవలసిన వాస్తవమై ఉన్నది. 1950వ సం. జనవరి నెల 26వ తేదీన H.E.H నిజాం జారీ చేసిన ఫర్మానా ద్వారా భారత రాజ్యాంగము హైదరాబాద్ రాష్ట్రమునకు వర్తింపచేయబడడము వలన దరఖాస్తుదారుల పరిస్థితిలో యున్న వ్యక్తులు కలిగి ఉన్న విలువైన అప్పీల్ హక్కును, సంకుచితమైన అన్వయము తీసివేస్తున్నందున, దీనికి సంబంధించి

రాజ్యాంగములో స్థిరమైన ఏ హక్కును పొందుపర్చనందున , ఆర్టికల్ 135లోని పదములు దరఖాస్తుదారులకు అట్టి హక్కును కలుగజేయగలిగినంత విస్తృతమైనవి అని నిర్ధారించవలసి ఉన్నదని దరఖాస్తుదారుల తరపున వాదించడమైనది. ప్రాథమికముగా ప్రతి శాసనం భవిష్యత్ వర్తితమే కానీ పూర్వ వర్తిత్వము కాదని గౌరవ అటార్నీ జనరల్ వాదిం చినారు. అప్పీలు హక్కు ను శాసనము ప్రస్ఫుటముగా ఇవ్వవలసి ఉన్నది , అంతే గాని అది కేవలం ప్రక్రియాత్మక హక్కు కా జాలదు. అందువలన రాజ్యాంగం ప్రకారము అప్పీలు హక్కు ఉనికిలో లేనప్పుడు , అటువంటి హక్కు హైదరాబాద్ రాష్ట్రానికి రాజ్యాంగాన్ని వర్తింపజేయడం వలన అంతర్నిహితముగా ఉనికిలోనికి వచ్చినదని, నిర్ణయింపజాలము. దీనికి సంబంధించి, ***ఢిల్లీ క్లాత్ అండ్ జనరల్ మిల్స్ లిమిటెడ్ వర్సెస్ ఇన్‌కమ్ ట్యాక్స్ కమీషనర్ , ఢిల్లీ & ఇంకొకరు 54 IA 421*** మరియు ***ది కలోనియల్ షుగర్ రిఫైనింగ్ కో. లిమిటెడ్‌వర్సెస్ ఇర్వింగ్ [1905] AC 369*** కేసులలో ప్రివీ కౌన్సిల్ ఇచ్చిన తీర్పులపై ఆధారం ఉంచబడినది.

ఈ అంశంపై అడ్వకేట్ జనరల్ గారి వాదన సరైనది అని మా అభిప్రాయము. భవిష్యత్ వర్తన మాత్రమే అన్న శాసనముల యొక్క సహజ అర్ధ వివరణ పద్దతి నుండి విభేదించడానికి ప్రస్తుత కేసులో ఏ కారణము కనిపించడము లేదు. ఆర్టికల్ 136 గురించి ప్రభుత్వము ఇవ్వజూపిన అర్థ వివరణకు, ఆ నిబంధనలో 'ఇక ముందు ' అన్న పదమును చేర్చవలసిన అవసరం ఉన్నదని , అది న్యాయోచితము కాదని శ్రీ . ప్రిట్ గారు వాదించినారు. ఈ వాదనను మేము అంగీకరించలేము , ఎందుకంటే ప్రథమదృష్ట్యా ప్రతి శాసనము భవిష్యత్ వర్తనమే మరియు "ఇక ముందు " అన్న పదమును ఉపయోగించకుండానే ఆర్టికల్ 136 లోని భాష అదే అర్థాన్ని తెలియజేస్తు న్నది. తేదీ 26.01.1950 కి ముందు, H.E.H నిజాం యొక్క ప్రభుత్వం ఒక స్వతంత్ర ప్రభుత్వము అయి ఉన్నందువలన , భారత దేశములోని ఏ కోర్టు గాని లేదా లండన్‌లోని ప్రివీ కౌన్సిల్ యొక్క జ్యుడీషియల్ కమిటీ గాని, హైదరాబాద్ రాష్ట్ర కోర్టుల తీర్పులపై న్యాయ నిర్ణయ అధికారం కలిగి లేదన్నది , ఈ కేసులో గమనించవలసిన

విషయం. అటువంటి రాష్ట్రంలోని కోర్టుల యొక్క తీర్పులపై న్యాయ నిర్ణయాధికార పరిధిని సుప్రీంకోర్టుకు కలుగజేయాలంటే, తప్పనిసరిగా అటువంటి కోర్టుల యొక్క తీర్పులతో వ్యవహరించడానికి న్యాయ నిర్ణయాధికార పరిధిని ప్రదత్తము చేయగల నిర్దిష్ట నిబంధనలు లేదా నిబంధనలు ఉండుట అవసరం. అటువంటి స్పష్టమైన నిబంధన లేకపోవడమనేది సాధారణ కారణమై ఉన్నది. వాని యొక్క సహేతుకమైన నిర్మాణం ప్రకారం అంతర్నిహితముగా అప్పీలు హక్కును కలుగజేయడానికి అవసరమైన పరిస్థితులేవీ ఇక్కడ మాకు కనిపించడం లేదు. నిజానికి "భారత దేశ భూభాగం" అన్న పదాలు విరుద్ధమైన ముగింపునకు దారి తీస్తున్నాయి. ఆర్టికల్ 136 లో ఉపయోగించిన పదముల ప్రకారం , తీర్పులు ఇచ్చిన లేదా శిక్షలు విధించిన కోర్టులు , తప్పనిసరిగా భారత దేశ భూభాగ పరిధిలో ఉండి ఉండాలి. 1950 సం. జనవరి నెల 26వ తేదీ కి ముందు H.E.H నిజాం ప్రభుత్వం యొక్క భూభాగపరిధి, భారతదేశ భూభాగపరిధిలో లేనే లేదు , అందువలన 1949 వ సం. డిసెంబర్ నెల 12 మరియు 14వ తేదీలలో H.E.H నిజాం యొక్క హైకోర్టు ఇచ్చిన తీర్పు మరియు విధించిన శిక్ష “భారతదేశ భూభాగ పరిధిలోని కోర్టు ఇచ్చినది” గా పరిగణింపజాలము. ఈ చిన్న కారణము వలననే దరఖాస్తుదారుల యొక్క వాదనలు విఫలమవుతున్నట్లుగా కనిపిస్తున్నది.

ఈ విధముగా అన్వయము చేసినట్లైతే , బొంబాయి ప్రాంత భూభాగ పరిధి కూడా ఆర్టికల్ 136 యొక్క వర్తన నుండి తొలగింపబడవలసి ఉంటుంది అని , దరఖాస్తుదారుల తరపున శ్రీ ప్రిట్ వాదించినారు. దీనికి సమాధానం ఏమంటే, 1950వ సం. జనవరి నెల 26వ తేదీకి ముందు బొంబాయి హైకోర్టు సివిల్ మరియు క్రిమినల్ కేసుల రెండింటిలోనూ ఇచ్చిన తీర్పుల నుండి సివిల్ ప్రొసీజర్ కోడ్ మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద మరియు హైకోర్టు యొక్క ఏకాధికార పత్రాలు (లెటర్స్ పేటెంట్) కింద అప్పీళ్ళ యొక్క హక్కు ఉనికిలో ఉండి , అవి , తగు శాసనము ద్వారా ఫెడరల్ కోర్టునకు , తదుపరి, ఆర్టికల్ 135 ద్వారా సుప్రీం కోర్టునకు , బదిలీ చేయబడినవి. అందువలన , మేము సరియైన అర్ధ

వివరణ అనుకుంటున్న భారత రాజ్యాంగములోని ఆర్టికల్ 136 యొక్క అర్ధ వివరణ ప్రకారం , బొంబాయి హైకోర్టు తీర్పు ల నుండి అప్పీ లు హక్కు , తొలగింపబడలేదు. విస్తృతమైన అర్ధము కలిగిన ఆర్టికల్ 136 లోని పదములను పరిగణించినప్పుడు , హై కోర్టు ఇచ్చిన తీర్పులపైననే కాకుండా మిగిలిన ట్రిబునల్ లు ఇచ్చిన వాని నుండి కూడా అప్పీళ్ళు దాఖలు అనుమతి కొరకు సుప్రీంకోర్టునకు దరఖాస్తు చేసుకొనుటకు ఇది (ఆర్టికల్ 136) హక్కును కల్పిస్తున్నది అన్న మాట నిజమే. ఈ విస్తృతమైన హక్కు తేదీ 26.01.1950 నకు ముందు ఉనికిలో లేనట్లైతే , అది న్యాయబద్ధముగా ఆర్టికల్ 136 క్రింద కొత్తగా ప్రదత్తము చేయబడినట్లుగా భావించవచ్చును మరియు అటువంటి భావన ఏ విధమైన అసంబద్ధతకు దారి తీయదు. అందువలన , ప్రస్తుతము మా ముందు ఉన్న కేసులన్నింటిలోనూ H.E.H నిజాం యొక్క భూభాగ పరిధిలో ఉన్న హైదరాబాదు హైకోర్టు తీర్పుల ను ఇవ్వడమూ మరియు శిక్షలను విధించడమూ జరిగి ఉండడము వలన , మరియు ఆ భూభాగం తేదీ 26.01.1950 నకు ముందు భారతదేశ భూభాగ పరిధిలో లేనందువలన , మరియు ఆ తీర్పులు రాజ్యాంగం అమలులోనికి రాక ముందు ఇచ్చినవై ఉన్నందున, అవి ఆర్టికల్ 136 క్రింద సుప్రీం కోర్టు యొక్క ప్రత్యేక అనుమతిని కోరదగిన తీర్పుల వర్గములోకి చేరజాలవని మేము అభిప్రాయబడుతున్నాము. భారత రాజ్యాంగములోని ఆర్టికల్ 135 పరిధిలోనికి ఇట్టి తీర్పులు రావన్నది స్పష్టమవుతున్నది.

అందువలన , హైదరాబాద్ హైకోర్టు ఇచ్చిన అటువంటి తీర్పుల నుండి అప్పీలునకు అనుమతి కొరకైన ఈ దరఖాస్తులతో వ్యవహరించడానికి , రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 క్రింద ఈ కోర్టునకు న్యాయ నిర్ణయాధికారపరిధి లేదన్నది , మా అభిప్రాయము. ఈ దరఖాస్తుదారుల కేసుల వంటి కేసులు ఆర్టికల్ 134, 135 లేదా 136 ల పరిధిలోకి రావు మరియు అందుచే ప్రస్తుతము ఉన్న శాసన స్థితి వలన సుప్రీంకోర్టు వారికి ఏ విధమైన సహాయమును అందించజాలదు. రాజ్యాంగంలో ఈ ఉపశమనను కలిగించుటలో ఉన్న లుప్తము( omission)ను, సుప్రీంకోర్టు సరిచేయజాలదు మరియు ఆర్టికల్ 134,

135 లేదా 136 లలో ఉన్న స్పష్టమైన పదములు సుప్రీం కోర్టునకు ఈ అధికారం ఇవ్వనందున ,
అటువంటి న్యాయనిర్ణయ అధికారపరిధిని కల్పించుకొనడము అనేది చట్టాన్ని రూపొందించడమే
అవుతుంది, అది దాని పని కాదు.

ఈ పరిస్థితులలో, ఈ దరఖాస్తులు తిరస్కరింపబడినవి.

**దరఖాస్తులు త్రోసిపుచ్చబడినది.**

———